క్లుప్తంగా

కొనసాగిన దీక్షలు



తాడేపల్లి రూరల్: తమకు రావలసిన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 316వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కార్మిక నాయకులు కె.ఆదినారాయణ, తుపాకుల నాగేశ్వరావు, సి.హెచ్.పిచ్చయ్య, వై.సాంబశివరావులు ప్రారంభించారు. వై.రమాదేవి, ఈశారమ్మా, వి.రిబ్కా, టి. దుర్గాభవాని, వి.కాసమ్మ దీక్షలో కూర్చున్నారు. నాయకులు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సమస్యను పరిష్కరించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వై. సుబ్బారావు, హగ్గయ్య, శివకుమారి, డి.బేబీమ్మ పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కళ్లం వెంకటరెడ్డి హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వారిని బుధవారం ప్రధానోపాధ్యాయుడు తాతిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. తాతిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ సెలక్షన్స్ అమరావతి వాలీబాల్ అకాడమీ పోటీలకు పాఠశాల నుంచి వీరు ఎంపికయ్యారని చెప్పారు. అండర్-19 విభాగంలో తొమ్మిది తరగతి చదువుతున్న ఎం. అజయ్, 7వ తరగతి చదువుతున్న పి.మహిత ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 20 నుంచి బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. దీనికి సహరించిన పీడీ కె.రజినీనాయక్, ఇతర ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

రేపు నిరసన ర్యాలీ



ఫిరంగిపురం: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు ఫిరంగిపురంలో ఈనెల 17వ తేదీన నిరసన ర్యాలీ జరగనుంది. సీజే గవాయ్‌పై దాడికి నిరసనగా ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దారు కార్యాలయం వద్ద కార్యక్రమం ఉంటుందని ఎంఎస్‌పీ నాయకుడు పి.థామస్ మాదిగ బుధవారం తెలిపారు. మండలకేంద్రంతోపాటు వసంత నగర్ ప్రాంతాల్లో స్థానికులతో ఆయన మాట్లాడారు. దాడి అనాగరిక చర్య అని, బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జి టి. మోషే మాదిగ, నాయకులు రవికుమార్, సురేష్, గోపి, రాంబాబు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ



ఫిరంగిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌జీఎస్‌ఏ- ఎల్ఎస్‌డీజీ 5లో భాగంగా పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా మూడురోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పారిశుధ్యం, పరిసరాల శుభ్రత, తడి, పొడి చెత్త వేరు చేయడం వల్ల కలిగే లాభాలు, పచ్చదనం పెంపొందించేందుకు పాటించాల్సిన పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఏపీఎం నాగేశ్వరరావు, డ్వాక్రా వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు నీటితో తిప్పలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి ముఖద్వారమైన ప్రకాశం బ్యారేజ్ నుంచి సీతానగరం పుష్కర ఘాట్‌కు వెళ్లే రహదారులు నిత్యం మురుగు నీరు పారుతుండటంతో పరిస్థితి అధ్వానంగా ఉంది. ఆ ప్రాంతంతో ప్రయాణికులు, పాదచారులకు అవస్థలు తప్పడం లేదు. కేఎల్ రావు కాలనీ నుంచి నిత్యం మురుగునీరు ప్రకాశం బ్యారేజీ రోడ్డుపై ప్రవహిస్తోంది. అటు నుంచి సీతానగరం పుష్కర ఘాట్‌లో సుమారు 500 మీటర్ల పొడవునా ప్రవహిస్తోంది. రోడ్లన్నీ పాకుడు బట్టి వాహనదారులు జారి కిందపడుతున్నారు. ఒక్కో సారి పాదచారులు కూడా ఈ తిప్పలు తప్పడం లేదు. రామకృష్ణ మిషన్ పాఠశాలకు వెళుతున్న ఓ విద్యార్థి తండ్రి కింద పడడంతో చెయ్యి విరిగింది. ఈ రహదారి నుంచి ప్రతి రోజూ వందల్లో వాహనాలు తిరుగుతుంటాయి.

పేదలకు వైద్య సేవలు దూరం

- కూటమి కుట్రలతో సామాన్యులకు అందని ద్రాక్షగా వైద్యవిద్య
- వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం
- అమాయకుల ప్రాణాలు బలి తీసుకుంటున్న నకిలీ మద్యం
- ఎమ్మెల్సీ మురుగుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డీవీఆర్





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు. వేదికపై దొంతిరెడ్డి వేమారెడ్డి తదితరులు, పాల్గొన్న పార్టీ నేతలు

మంగళగిరి టౌన్: రాష్ట్రంలోని పేదలకు వైద్య సేవలు, వైద్య విద్యను దూరం చేయాలనే దుర్బుద్ధితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుట్ర పన్నారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరు బైపాస్ వెంబడి ఉన్న నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మంగళగిరి మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ అధ్యక్షతన రచ్చబండ సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా మండల ముఖ్య నాయకులు, వివిధ అనుబంధ విభాగాల కమిటీలు, కార్యకర్తల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వారు మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుందన్నారు. దీన్ని నిరసిస్తూ సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాలేజీల నిర్వహణకు డబ్బు లేదని సాకు చూపి పీపీపీ విధానం పేరిట కూటమి నేతలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిన్నరలోనే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు పచ్చల రత్నకుమారి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్టిపోగు భూషణం, యువజన విభాగం అధ్యక్షుడు గౌస్ మొహిద్దీన్, నాయకులు కొసన శ్రీనివాసరావు, సుభాకర్, సందీప్‌రెడ్డి, గోపిరెడ్డి, సురేంద్ర, చైతన్య, షేక్ గౌస్, అనిత, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రెండు సెంట్ల ఇళ్ల స్థలం ఇవ్వాలి



కార్యక్రమంలో సీపీఎం నేతలు, పేదలు

తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలందరికీ రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, పెనుమాక నాయకులు ఎస్‌కే పీరు సాహెబ్, ఎస్‌కే ఖాదర్ బాబా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాజధానిలో భాగమైన పెనుమాక గ్రామంలో బుధవారం ఇళ్ల స్థలాలు కోసం సీపీఎం కార్యకర్తలు అర్జీలు సేకరించారు. ఎంటీఎంసీ పరిధిలో స్థలాలు లేని పేదలందరికీ ప్రభుత్వ హామీ మేరకు రెండు సెంట్లు ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లపై లబ్ధిదారులు అయిష్టత వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ నెల 17న మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొని అర్జీలు అధికారులకు అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ ఎర్రా పీరు, షేక్ ఖాదర్ బాబా తదితరులు పాల్గొన్నారు.

కొండభూమి వ్యవహారంలో స్తబ్దత



లాంలో ఆక్రమించిన ప్రభుత్వ స్థలంలో అధికారులు వెళ్లిన వెంటనే వెలిసిన బ్యానర్

లాం(తాడికొండ): తాడికొండ మండలం లాం గ్రామంలో కొండభూమిని ఆక్రమించిన కూటమి నేతల వ్యవహారం కొలిక్కిరావడం లేదు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోగా భూమి తమ మసీదుకు చెందిన స్థలంగా చెబుతూ బిలాల్ మసీదు పేరుతో బ్యానర్ వెలవడం మరో విశేషం. పరిశీలన పేరుతో వెళ్లిన అధికారులు ఇది ప్రభుత్వ స్థలం, ఆక్రమించిన వారు శిక్షార్హులు పేరుతో బ్యానర్ పట్టుకొని ఫొటో దిగి వచ్చారు. అప్పటికే బిలాల్ మసీదుకు చెందినది అనే బ్యానర్‌ను మాత్రం తొలగించలేదు. దీనిపై ఫిర్యాదుదారుడు ఆదిల్‌తోపాటు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌వోసీ జారీ చేసిన గ్రామ పంచాయతీ కార్యదర్శికి తహసీల్దార్ నోటీసులు జారీ చేయగా ఆయన బుధవారం విచారణకు హాజరయ్యారు. మసీదు స్థలంగా చూపిస్తూ ఇచ్చిన అగ్రిమెంట్ ఆధారంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, లేబర్ డిపార్ట్‌మెంట్ అనుమతులిచ్చినట్లు వెలుగులోకి తెచ్చారు. వాటితోపాటు దరఖాస్తు చేసినందునే ఎన్‌వోసీ జారీ చేశానని చెప్పారు.

ఉచిత దంత వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ హబీబుల్లా ఖాన్

తాడేపల్లి రూరల్: కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్, యూత్ రెడ్ క్రాస్, కాలేజీ ఆఫ్ ఫార్మసీల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్ తెలిపారు. విజయవాడకు చెందిన భరణి డెంటల్ కేర్ డాక్టర్ సి.ఎల్.వి. కిరణ్ కుమార్, డాక్టర్ నికిత కామటి వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని డీన్ స్టూడెంట్ అఫైర్స్ సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ ప్రారంభించారు.

గోశాల తరలించాలని ఆందోళన



అనంతవరం(తాడికొండ): తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామంలో అనుమతులు లేకుండా గోశాల నిర్వహిస్తున్నందున దానిని తరలించాలని బీజేపీ, వీహెచ్‌పీ నాయకులతోపాటు గ్రామస్తులు పలువురు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ స్థలంలో కొనసాగుతున్న ఈ గోశాలలో గోవులకు సరైన పోషణ అందించడం లేదని వారు ఆరోపించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పశు సంవర్థక శాఖ అధికారిణి రేణుకాదేవి గతంలో నోటీసులు జారీ చేసినా తరలింపునకు చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో బుధవారం మరో మారు నిరసన తెలిపామని పేర్కొన్నారు.

నేడు కోటి సంతకాల సేకరణ ఉద్యమం

దుగ్గిరాల: రాష్ట్రంలోని మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు మంగళగిరి బైపాస్ రోడ్డులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం చేపట్టనున్నారు. ముఖ్యఅతిథులుగా నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి దిశానిర్దేశం చేయనున్నారు. దుగ్గిరాల మండల అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు.

ఇనుము దొంగల అరెస్టు

మంగళగిరి టౌన్: నిర్మాణంలో ఉన్న భవనాల వద్ద ఐరన్ సామగ్రి చోరీకి పాల్పడుతున్న నిందితులను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై సి.హెచ్.వెంకట్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న కురగల్లు గ్రామంలో బీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించి సుమారు రూ. 2 లక్షల విలువ చేసే సామగ్రి చోరీ జరిగిందన్నారు. విజయవాడ ఇబ్రహీంపట్నంకు చెందిన చల్లా జగదీష్, గణేష్, దుర్గారావు, మరో ఇరువురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

ఈ- పంట నమోదు వేగంగా పూర్తి చేయాలి

తాడికొండ: ఈ- పంట నమోదు వేగవంతంగా పూర్తిచేయాలని మంగళగిరి వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు అన్నారు. బుధవారం తాడికొండ వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆర్‌బీకే సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు పండించిన పంటలను ఈ -పంట నమోదులో నూరుశాతం పూర్తిచేయాలన్నారు. పంట కోత అనంతర ప్రయోగాలు, దిగుబడి అంచనాలు రూపొందించాలని సూచించారు. రైతులకు సరిపడా ఎరువులు సకాలంలో అందేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఏవో బి శ్రీనివాస నాయక్, ఏఈవో కృష్ణారావు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా భారీ వృక్షాలు

తుమ్మపూడి - రేవేంద్రపాడు గ్రామాల మధ్య సుమారు 17 నుంచి 20 భారీ వృక్షాలు ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. తెనాలి - విజయవాడ ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటోంది. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాల్సి ఉంది.
– దుగ్గిరాల



వైఎస్సార్‌సీపీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు నియామకం

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ, వలంటీర్స్, లీగల్ సెల్, గ్రీవెన్స్ సెల్ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం జరిగినట్లు కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఉత్తర్వుల మేరకు ఫిరంగిపురం మండల వలంటీర్స్ విభాగం అధ్యక్షుడుగా జక్కుల రవి బాబు, లీగల్ సెల్ అధ్యక్షుడుగా షేక్ అబ్దుల్ జమీర్, మేడికొండూరు మండలం బూత్ కమిటీ అధ్యక్షుడుగా మండలానికి చెందిన బిల్లా లూర్ధయ్య, తాడికొండ మండల బూత్ కమిటీ అధ్యక్షుడుగా దామనబోయిన వెంకటేశ్వరరావు, తుళ్ళూరు మండల గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా సరిగల శ్రీనివాసరావును నియమించారు.

ఇన్‌చార్జి హెచ్‌ఎంకు అభినందన



తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం జిల్లాపరిషత్ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా పనిచేస్తున్న జోజప్పను తాడేపల్లి డీవైఈఓ డి.శాంత కుమారి బుధవారం అభినందించారు. పాఠశాల కంప్యూటర్ రూముకు మరమ్మతులు చేయించి, కంప్యూటర్‌లకు అవసరమైన విద్యుత్ పరికరాలు, ఏసీ ఏర్పాటు చేయించిన జోజప్ప సేవలు ఆదర్శనీయం అన్నారు. ఆయన సుమారు రూ. లక్ష సొంతంగా ఖర్చు చేసి వసతులు కల్పించడంతో అభినందనలు తెలిపారు.

ఓట్ల చోరీపై సంతకాల సేకరణ

తాడేపల్లి రూరల్: దేశ వ్యాప్తంగా ఓట్ల చోరీపై మద్దతుగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సంతకాల సేకరణ నిర్వహించారు. తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు శామ్యూల్ మాట్లాడుతూ ప్రజల నుంచి స్పందన వస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ జిల్లా కాపు సాధికారిక చైర్మన్ రేమిశెట్టి హనుమంతరావు, మంగళగిరి మండల అధ్యక్షుడు పొప్పాల కృష్ణచౌదరి, తాడేపల్లి మండల అధ్యక్షుడు షేక్ సుభాని, నియోజకవర్గ ఇన్‌చార్జి సలీం తదితరులు పాల్గొన్నారు.

17న మహా ధర్నాను జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్: పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ వెంటనే అమలు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రవి డిమాండ్ చేశారు. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసన దీక్ష బుధవారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రభుత్వ తీరును విమర్శించారు. మంగళగిరి మండలం రూరల్ సీపీఎం కార్యదర్శి యు.దుర్గారావు, మంగళగిరి పట్టణ కార్యదర్శి వీవీ జవహర్లాల్, గుంటూరు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



తాడేపల్లి రూరల్: కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



తాడికొండ: కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకట సుబ్బరత్నమ్మ



తాడికొండ: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న చైర్మన్ వైవీ ఆంజనేయులు



కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నాయకులు

మంగళగిరి టౌన్: భారతజాతి గర్వించదగ్గ గొప్ప మేధావి ఏపీజే అబ్దుల్ కలాం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరు బైపాస్ వెంబడి ఉన్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురుగుడు హనుమంతరావు, దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో జన్మించిన కలాం అత్యున్నత స్థాయికి చేరడం స్ఫూర్తి నింపే అంశమన్నారు. రాష్ట్రపతిగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ చరిత్రను మార్చిన వ్యక్తి కలాం అన్నారు. యువకులందరూ ఆయనను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని సూచించారు. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆయన బాటలోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకువచ్చిందని గుర్తు చేశారు. క్రమశిక్షణ, దేశభక్తి, విజయాన్ని సాధించాలనే సంకల్పాన్ని యువతలో పెంపొందించేందుకు ఆయన చేసిన రచనలు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మంగళగిరి మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షురాలు పచ్చల రత్నకుమారి, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, మంగళగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలు సంకే సునీత, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి ఫిరోజ్, మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ విభాగ అధ్యక్షుడు కట్టిపోగు భూషణం, నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ మొహిద్దిన్, నియోజకవర్గ ప్రచార విభాగ అధ్యక్షుడు సురేంద్ర, సుభాని, మానం నాగేశ్వరరావు, సుభాకర్, ఇందిరాదేవి, మిట్ట నిర్మల, అనిత, కురుమారెడ్డి, భరత్, కాంతారావు, బొమ్ము శంకర్ రెడ్డి, వాసపోలు రాజు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అంజిరెడ్డి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని కలాం నిరూపించారన్నారు. కింది స్థాయి నుంచి శాస్త్రవేత్తగా, దేశానికి రాష్ట్రపతిగా ఉన్నత శిఖరాలు అందుకున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, తాడేపల్లి పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడికొండ: అబ్దుల్ కలాం స్ఫూర్తితో నేటి యువత ముందుకు నడవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. వెంకట సుబ్బరత్నమ్మ అన్నారు. బుధవారం తాడికొండ శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కలాం జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అందరికీ కలాం ఆదర్శనీయులని పేర్కొన్నారు. గ్రంథాలయాధికారి కొండా చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలపతి విద్యా సంస్థలో..

కలాం స్ఫూర్తిగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వై.వి. ఆంజనేయులు అన్నారు. కలాం జయంతిని పురస్కరించుకొని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో డేటా సైన్స్ స్టూడెంట్స్ అసోసియేషన్, ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యూచర్ ఎక్స్ -2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలాం చేసిన సేవలను ఆయన గుర్తు చేశారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె. నాగ శ్రీనివాసరావు, డీన్ ఆఫ్ ఎగ్జామ్స్ డాక్టర్ వీవీ సుబ్బారావు, డీన్‌లు డాక్టర్ పి.బాల మురళీకృష్ణ, ఆర్గనైజర్ వి. సాయి శ్రీనివాస్, శాంతిప్రియ వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుగ్గిరాల: కలాం సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. బుధవారం మండల కేంద్రం దుగ్గిరాలలోని ముర్తజానగర్‌లో కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రషీద్, జానీ, మస్తాన్ వలి, జాన్ షైదా, జిలానీ, మహబూబ్, వేంకటేశ్వర్లు, యేల్లేశ్వర రావు పాల్గొన్నారు. కాగా, కలాం జయంతిని పురస్కరించుకుని స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం శోభాదేవి, చుండూరి భాస్కరరావులు కలాం విగ్రహానికి నివాళి అర్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



ఫిరంగిపురం: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం బాగుంటుందని తహసీల్దార్ జె.ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ చేతుల పరిశుభ్రతా దినోత్సవం బుధవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భోజనానికి ముందు, తరువాత తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం, వెలుగు ఏపీఎం నాగేశ్వరరావు, డ్వాక్రా యానిమేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.